కథ

# 'కలల మనిషి'



వి. చంద్రశేఖరరా

సమయం ఏడున్నర.

గది నిండా లేత వెలుగు. ప్రవాహంలా శబ్దాలు. లేచి కిటికీలు, తలుపులు గట్టిగా బిగించి, ప్రపంచం నుండి తనను, తన గదిని వేరు చేశానని తృప్తిగా నిట్టూర్చాడు సత్యప్రకాశం. తలుపులు, కిటికీలు వేశాక, గదిలో తను కాక మరో ప్రాణి కూడా ఉన్నట్టనిపించింది. బొయ్ బొయ్ మంటూ తిరుగుతున్న ఫాను, ఫాను తాకిడికి రెపరెప మంటున్న పుస్తకం, శరీరంపై నిర్లజ్జగా ప్రయాణిస్తున్న దోమ, నలిగి ముడుతలు పడి చాలా యేళ్లుగా శవాలపై కప్పడానికి వాడుతున్న గుడ్డలా ఉన్న దుప్పటి–ఇవేమి కాదు. మరింకేదో అసహనంగా కదిలాడు సత్యప్రకాశం. సొరుగులో ఉన్న గాజుసీసా, దూదితో, గాజుగుడ్డలో చుట్టిన చిన్నమూట గుర్తుకొచ్చింది. ఊపిరి ఆగిపోయినట్లుగా, భయమో వణుకో– తెరచి చూడాలని కోరిక. 'ఊహు! ఇప్పుడు కాదు. ఇంటిలో మనుషులందరూ వెళ్లిపోవాలి!' అనుకున్నాడు.

అతని రాత్రులన్నీ కలత కలతగానే గడిచిపోతాయి. బలంగా లోపలికి దిగబడిన బాకులా, ఒక భీకరమైన కల– అతని రాత్రిని అంటి పెట్టుకునే ఉంటుంది. మెలుకువలోకి కూడా ప్రయాణించి, లోలోపల కుళ్లులా ఉంటుందా కల. ఉదాహరణకు, రాత్రి వచ్చిన కల అతని శరీరం హఠాత్తుగా కుంచుకు పోవటం మొదలుపెట్టింది. "హనీ! ఐ ష్రంక్డ్ మై బాడీ!" అంటూ ఇంగ్లీషు పాటేదో హమ్ చేస్తుండగా, అతని యాభైయేళ్ల ముసలి కొవ్వు పట్టిన శరీరం, మూడు నెలల శిశువు శరీరంలా మారి– "శిశువు కాదు పిండం! పీటస్!" వెనక నుండి ఎవరో అరుస్తున్నారు. "ఇంతకీ ఆ పిండం బతికి ఉన్నట్టా? చచ్చినట్టా?" ఆ గొంతు అతనిదే, శిశువు నిర్జీవంగా గాలిలో తేలుతూ– "శిశువు కాదు! పీటస్! చచ్చినది!" మళ్లీ అరుస్తున్న గొంతు. అరుపుల మధ్య మెలకువ వచ్చింది. నిస్సత్తువ, దుఃఖం, అపరాధ భావం. అతని ఉదయాలన్నీ ఇట్లాగే వుంటాయి.

నిజానికి ఇవాళ అతను చాలా సంబరంగా ఉండాల్సిన రోజు. నిన్నటి నుంచి అతన్ని "శుభోదయం" వార పత్రికకు ఎడిటర్‌గా ఎలివేట్ చేశారు. శుభోదయం వారపత్రిక ఎడిటర్ సత్యప్రకాశం మాస్ట్‌హెడ్ కింద అతని పేరు దేశమంతా చదువుతుంది.

ఇంటర్‌నెట్‌లో చొరబడి అతని పేరు గ్లోబల్ విలేజి మొత్తం పాకుతుంది. సంబరంగా ఉండాల్సిన విషయమే. కానీ అపశకునాల్ని సూచించే తీతువు కూత ఉండీ ఉండీ మోగుతుంది. నొప్పి గానీ, ఆనందం గానీ తెలియనితనం, శరీరంలోకి ప్రవేశించినట్లు, గొప్ప ఆనందమేదీ కలగడం లేదు.

బయట, గది అవతల ఇట్లాంటివే చాలా గదులు. చాలా సేపటి క్రితమే మేలుకొని చప్పుడు చప్పుడుగా ఉన్నాయి.

పెద్దపెద్దగా 'ఏ' ఛానల్ కేకలు. కేకల మధ్య నన్నని ఈలపాట. కొడుకు సుందరం గది. రేబాన్ గ్లాసులు, డెనిమ్ జీన్స్, చిల్డ్ బీరు, పబ్‌లు, కళ్లలో బ్లూ ఫిలిమ్ రీళ్లు, ఏమిట్రా యిదంటే 'జస్ట్ ఫన్' అంటూ కన్ను గీటుతాడు. హీరోహోండా. వీపుపై క్యారీబ్యాగు. పెంటియమ్, కోబాల్, ఐబియమ్, ఎప్పుడూ కంప్యూటర్ భాషే మాట్లాడుతాడు. బ్యాక్ పాకెట్‌లో పాస్‌పోర్టు, వీసా అప్లికేషన్ అమెరికా నా చివరిగమ్యం అంటాడు.

నిన్నరాత్రి పబ్‌లో గొడవైంది. కత్తితో అతనిపైకి దూకాడో యూనివర్సిటీ కుర్రాడు. చేతిపై గాయం. అడ్డుగా వెళ్లిన సుందరం గర్ల్‌ఫ్రెండు చెంపపై అంగుళం లోతుకు దిగబడింది కత్తి. రక్తంతో తడిసి ముద్దయిన ఆ అమ్మాయిని ఇంటికి తెచ్చాడు సుందరం.

సత్యప్రకాశం భయంతో బిగుసుకు పొయ్యాడు. "లేనిపోని లంపటం! పోలీసులు, కోర్టులు, ఇంటిపై రౌడీల దాడి. ఆ పిల్లను రోడ్డుపై వదిలేసిరా!" అన్నాడు. "ఛో!ఛో!" ఆ పిల్లను కసిరాడు. రోషంతో ఆ పిల్ల బయటకు వెళ్లిపోయింది. ఇంటిమధ్య రక్తపు మరక. బకెట్ నీళ్లు తెచ్చి గుమ్మరించాడు. కొడుకు కోపంగా అన్నం కూడా తినకుండా గదిలోకి వెళ్లాడు.

మరోగది అతని భార్య సుశీలది. ఆ గది ఎప్పుడూ ఈసురోమంటుంది. ఆవిడకు రొమ్ము కాన్సరని చాన్నాళ్లు భయపడ్డారు. ఆపరేషన్ చేసి రొమ్ము తొలగించాల్సి వస్తుందనుకొన్నారు. ముక్క

త్రిపురనేని గోపీచంద్ లేని లోటుని తీరుస్తున్న వి. చంద్రశేఖర్ రావు గారి కథాపరంపరలో మరో మంచి ముత్యం.

